ఊళ్లోని రోడ్లన్నీ నిర్మానుష్యం అయిన వేళ, కుక్కలూ, నేకలూ తప్ప వేరేవీ కనిపించని వేళ,

కలవాళ్ళందరూ అద్దాలమేడల్లో పంకాల క్రింద పడుకొని, ఏర్కండిషన్ ఈ పాడు కొంపలో లేదని విసుక్కుంటున్న సమయంలో—

మిట్టమధ్యాహ్నం. నల్లగా, మెలికలు తిరుగుతో, మెరుస్తో, ఎండకు చెమట కక్కుతున్న తారురోడ్డుమీద హుషారుగా, ఈలేసుకుంటూ, రిక్షా తొక్కుకుంటూ వెళ్తున్నాడు వీరడు.

"సీ! ఎదవది." అని ఎండనీ, ఆ ఎండని సృష్టించే సూర్యుణ్ణీ కలిపితిట్టేవీరడు. ఆ రోజు అంత ఎండ, తనను మాత్రం సోకనట్టు, తనకది వెన్నెల్లా చల్లగావరాలుచిలిపి' పూపుల్లాఫీలయ్యేడు

పొద్దున రిక్షా అద్దెకు తీసుకొంది మొదలు ఏడెనిమిది బేరాలు తగిలాయి. పర్వాలేదు. రిక్షా అద్దెడబ్బులొచ్చేశాయ్. ఇహ వచ్చేదంతా నాకేననుకొని చుట్టు ప్రక్కలా చూశాడు బేరం తగుల్తుందేమోనని.

దూరంగా వరిపి. చెట్టు క్రింద కూర్చొని అట్లుపోస్తోంది. అది చూసేసరికి వీరడికి ఆకలి ఎక్కువయినట్లయింది. కానీ. తను ఈరోజు దుబారా ఖర్చుచెయ్యకూడదు. సాయంత్రం ఇంటికెళ్ళేప్పటికి ఎలాగైనా అయిదు రూపాయల నోటు కళ్ళచూడాలి

పొద్దున గుడిసెనించి బయటపడ్డపుడు—

"వరాలుకు ఏం తెస్తావ్‌రా అల్లుడా" అని అత్తమ్మ అడిగిన ప్రశ్న—

"ఏం తేలేవులే" అన్నట్లనిపించే ఆ వెక్కిరింపు—

"వరాలిప్పుడు ఉట్టిమనిషిగాదురా. కైరిబాగులేదా. నీళ్ళోసుకొంది. కోక లేకుంటేపోయే. ఓ రెవికముక్కయినా తీసుకరా"-అని చెవులు చిల్లులు పడేలా అత్తయ్య గొంతు వీపు వెనక.

అత్తమ్మన్నదిగూడా నిజమే. వరాలుకిది మొదటిసూలు. ఏరి కోరిచేసుకొన్న పెళ్ళాం.

"పెళ్ళాం అంటే బెల్లంలా సూసుకోవాలి రా వీరిగా! మనసయిందని మురిసిపోతే సాల్దు. మనువాడే ముందు ముదుపుకూడ బెట్టాలి"—అన్న అత్తమ్మ మాటలు ఒక్కసారి గుర్తుకొచ్చేయి.

వరాలుకు పాపం. పండంటి బిడ్డని చేతికెత్తుకోవాలని ఎంతో వుబలాటం. ధూత్! ఎదవ బతుకులు. ఇలాంటి వేళలో గూడా ఓ రెయికగుడ్డ కొనిపెట్టడానికి డబ్బులుండవ్. 'ఏంటో'!

కుక్కగొడుగుల్లాపుట్టి—
వీధికుక్కల్లానే పెరిగి—
ఇంతతిని.
అంత ఆకలితో—
కొందరితో కొట్లాడి—
చివరికి దిక్కులేని వాళ్ళలా మరలా మట్టిలో కలిసిపోవడం—

రెండు పెడబ్బుమీద లేచి నిలబడి. తల నిక్కించి చూశాడు వీరడు. ఎక్కడైనా బేరం తగుల్తుందేమోనని. ఒకరిద్దరడిగేరు. రిక్షా కడతావా. అని. కానీ. పాతిక పైసలకొస్తావా. పదిపైసలకొస్తావా అని బేరం పెట్టారు. వీరడికొక్కసారి చిర్రెత్తుకొచ్చింది.

"పో. బాబూ పో. నాకెందుకొచ్చిన అవస్త. కాలినడకపోతే. ఆ పాతిక పైసలూ మీకే మిగుల్తాయ్!"

కొవ్వెక్కింది వెధవకు అనుకుంటూ వెళ్ళిపోతున్న పెర్లిన్ బాబును. చొక్కా యుచ్చుక కొట్టాలనిపించింది వీరడికి. కాని. ఎందుకిపోకిరి చేష్టలీ రోజు. అని వూరుకుని పోయాడు

నెత్తిమీది సూర్యుడు నడుంమీదకొచ్చేశాడు. అలా, అలా. కాళ్ళక్రింది కెళ్ళిపోయాడు. బేరం ఒకటి రాలేదు. వీరడికి కడుపులోని కండలు మెలికలు తిరుగుతున్నాయి. రెవికగుడ్డ కోసం పొద్దుట్నుంచి నాస్తాగూడా చెయ్యలేదు..

నరిశి. దాని వల్లని చేతుల్లోంచి నూనెలో మిలమిలా మెరెపే మినపట్లు.

గుర్తుకొచ్చేయి.

అంతలో తను గుడిసెలోంచి బయటి కొచ్చినపుడు, అత్తయ్య నోటివెంచి రెవికగుడ్డ మాట రాగానే, వరాలు రేట క్కాళ్ళల్లోవి తళ, తళ గూడా గుర్తు కొచ్చింది.

డబ్బులు గిట్టనిరోజు అలా అస్పత్రి కెళ్తే, బేరాలు తగలటం చాలా మామూలే. మెయిన్గేట్ వైపు వచ్చే, పోయే వాళ్ళను ఆశతో చూశాడు.

''ఈ అస్పత్రికి ఇంతమంది వస్తారు గదా, ఈరోజు ఒక్క మహారాజయినా చచ్చి పోడేమిటి?'' ఒక్క శవాన్ని రిక్షాలో ఏసుకెళ్తే నాల్గురూపాయలు గిట్టుతాయి''

అని, మానవజాతి మీద ఉమ్మడిగా విసుక్కున్నాడు. ఆరోజు ఎవడూ చావ నందుకు.

ఈరోజు వరాలుకి రెవికగుడ్డ ఎలా కొనాలో ఏం అంతుబట్టడంలేదు.

ఇంతలో, అల్లంత దూరాన—

అతి త్వరగా అడుగులేసుకొంటూ తెల్లని రెక్కలు విప్పుకొన్న పావురంలా నర్సు. ఆమె వెనకాల చెమటపట్టిన మొహంతో, ఒక ముసలి మనిషి-ఇక బతు కులో మిగిలిందేదీ కనేమోననే అకర్దాతో.

''ముంచుకొచ్చిందిరా బాబూ ఎవరికో అదృష్టం బాగానేవుంటే'' అనుకున్నాడు వీరడు.

''రేయ్! రిక్షా! రక్తం ఇస్తావా'' అని నర్సు తననడిగే ప్రటికి అదిరిపడ్డాడు. పోలేరమ్మ పూనకంవచ్చి, నాకు నరబలి వెంటనే ఇస్తావా, లేక నిన్ను అపళంగా మింగేయనా, అని అడిగినట్లు భయపడి పోయాడు.

''ఏంవిటలా గుడ్లప్పగించి చూస్తావ్? రక్తం అనగానే అలా బెదురుగొడ్డులా నీఱక్కపోయావ్ ఈ అయ్యగారి భార్యకు వెంటనే రక్తం ఎక్కించాలి. లేకుంటే బతకదు. నీకు బాగా డబ్బులు వస్తాయి. తర్వగా తేల్చి చెప్పు. నువ్వు కాకుంటే మరొకడు''—అని, అతి నాజూగ్గా.

ఈ రోజు పనీమూకు తీసుకెళ్ళావా మూవా:, అని వరాలడిగినంత తేలిగ్గా అడిగింది నర్సు.

అమ్మో! రగతవే:. రగతంయిచ్చేస్తే, తను రేపట్నుంచి రిక్షా తొక్కేదెంటి! ఇదేంటీ రక్తపు కూడు ఛీ, పోండి, నేను రాను - అని తిరస్కరించుకోవాలను కున్నాడు.

కాని, ఇటువైపు నర్సు వెనక నిల్చొన్న ముదురు మనిషిని చూడగానే అభిప్రాయం మార్చుకొన్నాడు. కాళ్ళు చేతులు అవిటి అయిపోయినట్లు మోకాళ్ళ మీద తల ఆనించి, చలనం లేకుండా కూర్చొనున్న అతన్ని చూడగానే జాలే సింది వీరడికి.

డబ్బులు బాగా గిట్టుతాయట. అలా అయితే, రెయికేం ఖర్మ వరాలుకు కోక్కూడా కొనిపెట్టొచ్చు - అనుకొని రిక్షా తొట్టిలోంచి దిగి బీడీ ముక్క విసిరేసి—

''పదండి రగతం నేనిస్తానని నర్సు వెనకాతలే నడిచి వెళ్ళాడు.

రక్తం తను ఇస్తానన్నాడేగానీ. అది ఎలాగ యియ్యాలో—

గొంతు కోసుకొని ఇయ్యాలో—
కడుపు చీల్చుకొని ఇయ్యాలో—
ఇవేంవీ వీరడికి తెలియవు. తెలిపిం

దల్లా. తనతో బాబ్జీ రిక్షా తొక్కే ఎల్లయ్య సుక్కాకు దబ్బులు తక్కువయినప్పుదల్లా ఇలా. ఈ ఆస్పత్రిలోనే రక్తం ఇచ్చి మక్కేసుకొని, చుక్కల దగ్గరికెళ్తాడని.

సీ: ఎదవా, నీదంతా లేకి బతుకు అని వాణ్ని ఎన్నోసార్లు తిట్టేదు గూడా.

ఆస్పత్రిలో—

ఇంద్రపురిలాగా, గొప్పోళ్ళ బతుకుల్లా దేదీప్యమానంగా వెలిగి పోతూన్న ట్యూబ్ లైట్లు—

దేవలోకంలోంచి అప్పుడే దిగివచ్చిన వాళ్ళలా, తెల్లని బట్టల్లోని డాక్టర్లు పరా లిచ్చే చల్లని తల్లుల్లా గొన్లతో ఇంకి పోయిన నర్సులు—

వాళ్ళ నవ్వులు—

నవ్వుల పువ్వులు—

కేరింతలు—

సరసాలు-మిటకరింపులువెక్కిరింతలు చూపి ముచ్చట పడ్డాడు వీరడు.

నేనీ, డాక్టరు బాబుల చుట్టూ చేరి, మా బతుకుల నేం చేస్తావ్ బాబూ, మా యింటి దీపం వెలిగించు, మా దుఃఖాన్ని దూరం చెయ్యి బాబూ-అంటూ ప్రార్థించే చూపులు-మంచాల మీద మాసిపోయిన గడాలు: కంపు కొడుతూన్న గావంచాలు-

ఎండిన రొమ్ములు—

వెలుగులేని కళ్ళు—

వీళ్ళందరిలో—

విల్కిన్సన్ షేవ్‌లు—

పిల్కా చీరల ముడతలు—



ముడతల్లోంచి సెంటు వాసన ఘుమ. ఘుమలు—

చూసేసరికి, వీరడి కెందుకో చాలా బాధనిపించింది.

మంచం మీద ఇలా పడుకో-అంది నర్సు చెయ్యిలా పెట్టు అంటూ ఈడ్చింది. ఊసులు పోతోందిరా పిల్ల, అనుకొని మురిసిపోయాడు వీరడు ఏవేవో గాజు గొట్టాలు, సీసాలు అమర్చేరు పక్కన. చేతికి సూది గుచ్చారు. అంతే, రక్తం వెళ్ళిపోత్తోంది సీసాలోకి, వీరడి శరీరం లోంచి—

రక్తం అంతా తీసేస్తోంది ఈ నర్సు. దీని బాబు సొత్తనుకుందోనేమోనని గొణిగేడు.

అలా ఎంతసేపయిందో తెలీదు. గొట్టాలు, సీసాలు అన్నీ తీసి పారేశారు అందరూ కలిసి.

వీరడి కేదో సుస్తీచేసి లేచినట్లయింది. ఈ పాలు తాగు-అంటూ గ్లాసు చేతి కిచ్చింది నర్సు.

ఆస్పత్రివించి బయటికి నర్సు వెనక నడిచి వచ్చిన ముదురు మనిషి జేబులో చెయ్యి పెట్టి, చూలుకొచ్చిన గేదెలా, పొట్టనిండుగా వున్న నల్లని పర్సుతీశాడు. నర్సు యింతలో అతన్ని వారించి లోనికి తీసికెళ్ళింది.

లోపల ఆపరేషన్ థియేటర్‌లో అచే తనంగా పడుకొని వున్న ముదురు మనిషి భార్య పక్కన నిల్చొని—

డాక్టరుబాబు ఏడు పదిరూపాయల నోట్లు తీసుకొన్నాడు. ఏడు పది రూపా యల నోట్లనించి ఒకటి నర్సు పర్సులో కెళ్ళిపోయింది. పది నర్సు కిచ్చినందుకు కమ్మని ముద్దొకటి వసూలు చేసుకొన్నాడు. రుమాల్తో మొహం తుడుచుకొన్నాడు. (నర్సు పెదిమల ఎంగిలి కూడా).

మేల్నర్సుకు మరో పది రూపాయలు పోగా, మిగిలిన ఏభై లోంచి ఓ పాతిక డాక్టర్‌బాబు అప్రాన్ జేబులో కెళ్ళి పోయింది.

మిగిలిన పాతిక కాళ్ళొడ్చుకుంటూ వీరడి చొక్కా జేబులో కొచ్చింది.

''అంతా అయిపోయింది. ఇంటికెళ్ళి కడుపు నిండా తిని పడుకో'' అంది అర్జం టుగా నర్సు.

బయటి కొచ్చేడు వీరడు. రోడ్డు మీద చింతచెట్టు క్రింద తోసిగా. ఈసురో మంటోంది రిక్షా.

ఇంత డబ్బు. పాతిక రూపాయలు. అది గూడా ఒకచే రోజు. నేనెప్పుడూ చూళ్ళేదు. ఆ మాటకొస్తే నా బాబు గూడా చూసుండడనుకొంటూ రిక్షా రోడ్డు మీది కెక్కించాడు.

వీరడి బుర్రలో వేయి ఆలోచనలు. జేబులో పాతిక రూపాయలు. తన రక్తం విలువ పాతిక రూపాయలు - వరాలుకు మాంచి రెయిక గుడ్డ ఛీ! ఛీ! రెయికేం ఖర్మ. కోకే కొనగలడు తనిపుడు.

తన కిష్టమైన పచ్చని కోకలో వరాలు సీతాకోక చిలకలా వరాలు - ముద్దబంతి పువ్వులా మురిసిపోతుంది. అది నవ్వి నపుడు పడే సొట్టలు-కళ్ళతో ఆ పిలిపి—

బజారంతా కళ్ళలో ఒత్తులేసుకొని వెతికాడు వీరడు బట్టలషాపు కోసం. కానీ ఆ రోజు రావల్సినంత లాభాలు ఎప్పుడో వచ్చేశాయ్. అందరూ షాపులు మూసేసి వెళ్ళిపోయారు. తెరిచున్న దుకాణంలో

రెవిక గుడ్డలు కొన్నాడు వీరడు.

మొత్తం బజార్లో తెరిచి వున్న రెండో దుకాణం ఒక్కటే. అదే సాంబయ్య సారా దుకాణం.

ఎంత వద్దనుకున్నా. సారా బట్టీ ముందర రక్కువ ఆగిపోయింది వీరడి రిక్షా లోనికి తొంగి చూశాడు. లోపల తెలిసిన ముఖాలు వున్నాయ్.

''వళ్ళంతా బాగా నలతగా వుంది కాస్త చుక్కేసు కుంటే కొంపలేం కూలవ్ కోక కావి పెట్టేనన్న సంబ రంలో వరాలు ఇదంతగా పట్టించుకోదు గూడా!'' అనుకుంటూ సారా బుద్దితో దూరాడు వీరడు.

లోన, దొంగ సారా.

ట్యూబుల్లోంచి పీపాల్లోకి. పీపా ల్లోంచి గ్లాసుల్లోకి, గ్లాసుల్లోంచి గొంతుల లోకి ఖాళీ అయిపోతోంది. ఆకలిగొన్న కడుపుల్లోకి. అలా ఇంకి పోతూంది. సారాలోంచి ముమ్మరంగా బూతులు-

అమ్మలు, అమ్మమ్మలు,
అప్పా చెల్లెళ్ళు,
కన్న వాళ్ళు, కట్టుకున్నోళ్ళు,
తెంచిన వాళ్ళు,
తెంపించిన వాళ్ళు.
వదిలేసిన వాళ్ళు.
ఉంచుకొన్న వాళ్ళు-
ఎప్పుడో, పుట్టి, పెరిగి, చచ్చిన
ఏడు తరాల వాళ్ళు—
పుట్టి, పెరిగి, చావబోయే
ఇటు ఏడు తరాల వాళ్ళు—
చెమట కంపు చెర్మం వించి-
సారా కంపు నోట్లోంచి—
మాటలు, బదులు మాటలు—

వెక్కిరింపులు.

అయ్యో పాపం-లతో సాంబమ్మ సారా దుకాణం అంకమ్మ జాతర్లావుంది.

''అరగ్లాసుసారాతాగడాన్కి- అరు నెల్లా లోచించే వాడి వీరోజు. ఇలా గాలిన్లు పట్టించేస్తున్నావేం కత'' అంటూ ఎత్తి పొడిచాడు. వీరణ్ని అప్పన్న.

ప్రొద్దిటినించి ఆకలితో సతమత మయి పోయిన వీరడి శరీరాన్ని. సారా. అప్పన్న ఎత్తిపొడుపు. కలిపి. బాగా గేరెక్కించేశాయ్.

''గేలన్లు గాకుంటే పీపాలకు. పీపాలే పట్టించేస్తాన్రా. ఎదవ నాయాలా నా ఇష్టం. ఎవడబ్బ సొత్తనుకున్నావ్! పెద్దా స్పత్రిలో. రగకం. రగతంరా. రగత మిచ్చి సంపాయించాను. వీదికాదు.నీ అబ్బదిగాదు. నీ బాబ్బాబు దనలేకాదు. ఇది నా డబ్బు కట్టుకొన్న దాన్ని ఇక ర్లకి పడుకో బెట్టి సంపాయించాననుకున్నావురా? నోరెత్తకు. మర్లా మాటాదే వంటే మూతి పళ్ళు రాలగొడతాను. ముచ్చు ఎదవా'' అంటూ రెచ్చిపోయాడు.

నేను విన్నంటే నా పెళ్ళాం వూపెత్తుతా వేంరా.లేవి ముండాకొడకా'' అంటూ వీరడి జుట్టు పుచ్చు కున్నాడు అదివరకే కైపెక్కి పోయిన అప్పన్న.

చేతులు కలిశాయ్. సారా నెత్తినా. మొహానా పారింది. ఇతర్ల కేవీం పట్టనట్లు తమాషా చూస్తున్నారు.

మరొక్క గ్లాసు పట్టించిన అప్పన్న ఖాళీగ్లాసును వీరడి మొహం మీదికి విశి రేశాడు గ్లాసొచ్చి వీరడి తలమీద బాకులా గుచ్చుకొంది. దెబ్బతో ఒక్కసారి తెలివి తెచ్చుకొన్న వీరడు. తన తలమీంచి

మీరు కష్టపడి సంపాదించుకొన్న సొమ్ముకు సరియైన విలువగల సైకిల్ కొనదలచుకున్నారా? హెర్క్యులిస్



ప్రతీ పైసా కూడ మీరు కష్టపడి చెమటోడ్చి సంపాదించుకున్నారు. మీరు కూడబెట్టిన అమూల్యమైన సొమ్మును సరియైన విలువగల సైకిల్ మీద పెట్టాలి కదా?
హెర్క్యులిస్‌ను కొనండి. దానికి మీరు ఆశించే అన్ని లక్షణాలున్నాయి — బలిష్టత, సాఫీగా పోవడము నిశ్చితము, వేగము, మన్నిక.
అది సహజమే.
హెర్క్యులిస్ — ఆగ్నేయ ఆశియాలో అన్ని సౌకర్యాలు గల పెద్ద ఫ్యాక్టరీలో నిర్మించబడింది కలకాలం మీ జీవితమంతా మీకు సేవజేస్తుంది. భారత దేశమందంతటా 8,000,000 మంది హెర్క్యులిస్‌నే విశ్వసించేవారిలాగే మీరు హెర్క్యులిస్‌ను విశ్వసించవచ్చు.
హెర్క్యులిస్ ఒక్క సైకిలేకాదు- మీ జీవిత కాలపు నేస్తము.
భారత దేశములో తయారుచేయువారు: టి. ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు. మద్రాసు-53.
ప్రొప్రైటర్లు: ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనుమతిని పొందినవారు.
* రిజిష్టర్డ్ ట్రేడ్‌మార్క్ -
ది హెర్క్యులిస్ సైకిల్స్ & మోటార్ కో., లిమిటెడ్ యు. కె. వారిది.



TIC-H-5452

పారుతోన్న రక్తం చూసి—ఓలమ్మో. రగతం, రగతం, లంజి కొడుకు చంపేశాడురో, నాయనో—అంటూ కుప్పలా కూలిపోయాడు

• • •

అప్పుడు ఆ రాత్రి—

వీల్లాడనున్న వరాలు.

రెవిక గుడ్డ తెస్తావా అనడిగిన అత్తమ్మ. ప్రొద్దుటి వరాలు నవ్వ—

నవ్వినపుడు చక్కని సొట్టలు—

ఇవేవీ వీరిగాడికి గుర్తులేవు.

• • •

అదే రాత్రి సమయంలో,

గుడిసెలో గుర్రుపెట్టి నిద్రపోతోన్న వరాలుకు కడుపులో పేగు ఏదో జారిపోయి నట్లయి—

అమ్మో పేణం పోయిందే, అంటూ దయ్యం పట్టినట్టు లేచి కూర్చుంది

పిడకలమ్మి సంపాదించిన చిల్లర డబ్బుల్తో అత్తమ్మ వరాలుని ఆస్పత్రికి తీసి కెళ్ళింది రిక్షాలో.

ఆస్పత్రి ఎమర్జెన్ గేటు రాత్రి సమయాల్లో ఎప్పుడూ మూసుకొనే వుంటుంది. వేళకాని వేళల్లో ఎవరెవరి కోసం, ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో తెరుచు కోవాలో దానికి బాగా నేర్పారు అధికారులు.

పోలీసు వాళ్ళకీ, పొంచి కాజేసే వాళ్ళకీ వెంటనే ప్రవేశం. కార్లకూ (కార్లోని కుక్కలకు గూడా) అవసరంగా ప్రాప్తి మవుతుంది మోక్షం. తక్కిన వాళ్ళ అదృష్టం. వాళ్ళగీత. ఆరోజుకి వాళ్ళ మొహం మీద బ్రహ్మదేవుడు రాసిన రాత మీద ఆధార పడి వుంటుంది.

అపస్మారకంగా పడున్న వరాలుకి, గేటు తెరుచుకోనది బాగా మోరాయించింది. అత్తమ్మ బొడ్లోని రూపాయ బిళ్ళ చూసే సరికి, పులినోర్లా విచ్చుకొంది. చప్పున.

వరాలుని లోపలికి తీసి కెళ్ళిన డాక్టరమ్మ, బయటకొచ్చి, చప్పగా, చల్లగా మూల కూర్చొనున్న అత్తయ్యతో ఏదో చెవిలో చెప్పింది. సన్నగా అత్తమ్మ నెత్తి, నోరూ బాదుకుంది.

"ఓరి దేవుడో, కడుపు పోతే పోయింది. నాతల్లి పేణాన్ని కాపాడరా వెంకన్నా రగతం నేనేడ్నుంచి తెచ్చేదిరా. నాయనో రగతం ఈదగిన ఈరడు యాడ్నో దాంగొని వచ్చాడు, బాబో. యాడ్నుంచి తేను యాభై రూపాయలు దేవుడో. కన్న కడుపులా కాయ్యకు గంగమ్మ తల్లీ'. అంటూ శోకాలు పెట్టింది, అందరూ కలిపి అత్తమ్మను బయటికిగెంటేసారు.

• • •

ప్రొద్దున్నే ఎండ వేడికి ప్రపంచం లోకి వచ్చిన వీరడు, రిక్షాని విసురుగా బజార్లోకెక్కించి, గుడిసె వైపు వెళ్ళి పోయాడు

• • •

ఆ మధ్యాహ్నం, ఏటొడ్డున, మండు టెండలో ఇసక తెల్లగా, స్వచ్ఛంగా మెరిసి పోతోంది. దూరంగా, ఎండకు చెట్టుమీద చేరిన గద్దలు గోల చేస్తున్నయ్. వరాలు గుడెల మీద కొరివి పెట్టిన వీరడి కళ్ళు వెచ్చని కన్నీళ్ళతో నిండి

పోయాయి. పిండిన కళ్ళు భగ్గుమని మండేయి. కళ్ళనించి మంటలు—కడుపు మంట—కన్నీళ్ళమంట

చప్పున, తేలుకుట్టి నట్లయి, జేబులో చెయ్యి పెట్టి ఏదో బయటకు తీశాడు. పీరడు. పామును చూచినట్లు బిత్తర పోయాడు.

రాత్రి స్పృహలేని స్థితిలో, కారే రక్తాన్ని తుడుచు కోడానికి వుపయోగించిన—రక్తం మరకల్తో—వరాలు తని తను కొన్న పచ్చ రంగు రెవిక గుడ్డ.

(''ఎక్కడా కానీ పుట్టకపోతే కొంత మంది ఆస్పత్రికి వెళ్ళి అయిదు రూపాయలు కోసం రక్తదానం చేసేస్తారు. అంత త్యాగం చేసి ఇంటికి ఆ అయిదూ పట్టుక పోదాం అంటే, అందులో రూపాయి అక్కడుండే ఛోటా ఉద్యోగి లాక్కుంటాడు కథ రాయొచ్చు''— అన్నారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు. అదే ఈ కథకు మూలం.) •



డిష్ట్రిబ్యూటర్స్: ఆంధ్రప్రదేశ్ (తెలంగాణాతో కలుపుకొని) మరియు ఒరిస్సాలకు
ప్రగతి ఏజన్సీస్
పో. బా. నం; 173; పులిపాటివారివీధి, విజయవాడ-1.